సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం : 8 : మే : 2024



..దేశాన్ని అమ్మేస్తాడు

రాహుల్‌గాంధీ ప్రధాని అయితే దేశాన్ని అమ్మేస్తాడని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.

వివరాలు IIలో ▸



సంక్షేమానికి ప్రాధాన్యం

మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.2 /21.2

వాతావరణం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కేటీఆర్ రోడ్‌షో



అచ్చంపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అచ్చంపేటలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా సాయంత్రం 4 గంటలకు కేటీఆర్ రోడ్‌షో ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు మండలంలోని నడింపల్లిలో ఈదురు గాలులకు ఇంటి పైకప్పు రేకులు ధ్వంసమైన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. కాగా, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ప్రచారాలకు వెళ్తే దాడులకు యత్నిస్తున్నారని ఆరోపించారు. దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, అమీనుద్దీన్, రవీందర్‌రావు, శంకర్, కుత్బుద్దీన్ ఉన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



ఉప్పునుంతల: విధి నిర్వహణలో వైద్యసిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) డా.ఉమేష్ చంద్ర సూచించారు. మంగళవారం ఉప్పునుంతల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వచ్చేనెల మొదటి వారంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభించడానికి కావాల్సిన పరికరాలు, ఇతర వసతులను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలని చెప్పారు. సీహెచ్‌సీలో సరిపడా డాక్టర్లు, సిబ్బందిని నియామకానికి సంబంధించి కమిషనర్‌కు నివేదిక పంపించనున్నట్లు తెలిపారు. ఈఏడాది ఎండలు తీవ్రంగా ఉన్నందున ఆస్పత్రిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు రమాకాంత్, శివలీల, ఫార్మసిస్టు శ్రీనివాసులు, స్టాఫ్ నర్సులు ఉఫత్, వెంకటమ్మ, సిబ్బంది నజీర్ ఉన్నారు.

'ఇండియా కూటమిదే విజయం'



కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూట మి విజయం ఖాయమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించగా.. మంత్రి జూపల్లితో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు లోపాయికారి ఒప్పందంతో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి ప్రజాసమస్యలు తెలిసిన వ్యక్తి అని.. ఆయనను గెలిపించుకుంటే ఇక్కడి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తారన్నారు. కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. ఇక్కడ కూడా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందామని సీపీఐ నాయకులను కోరారు. కాగా.. కేంద్ర, రాష్ట్ర కమిటీల నిర్ణయం మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులు పనిచేయాలని సీపీఐ నాయకులు బాల్‌నర్సింహ్మా, ఫయాజ్ సూచించారు. సమావేశంలో ఏసయ్య, కిరణ్‌కుమార్, ఇందిరమ్మ, వెంకటస్వామి, యూసుఫ్, శ్రీనివాసులు ఉన్నారు.



వలస ఓటరు ఎటు వైపు?

- **లోక్‌సభ ఎన్నికల్లో వలస కూలీలపై దృష్టిసారించని ప్రధాన పార్టీలు**
- **ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయంగా ప్రభావం చూపిన వైనం**
- గ్రామీణ ప్రాంతాల్లో 20 శాతం వరకు వారివే..
- ఉమ్మడి జిల్లాలో 3.5 లక్షల మందికిపైనే ఓటర్లు
- ఖర్చుతో ఎక్కువ కావడంతో పార్టీల వెనుకంజ

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు అంటేనే వలసలకు చిరునామాగా పేరొందిన జిల్లా. ఎంతో మంది ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలైన ముంబై, పుణె, సోలాపూర్, భీమండి ప్రాంతాలతోపాటు హైదరాబాద్, ఇతర ప్రధాన పట్టణాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారు. కొందరు కుటుంబాలతో సహా అక్కడికి వెళ్లి స్థిరపడ్డారు. అయినప్పటికీ ప్రధాన పండుగలతోపాటు పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాలకు ఇక్కడికి వచ్చి వెళ్తుంటారు. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో సుమారు 3.5 లక్షల మంది వలస ఓటర్లు ఉన్నట్లు అంచనా. కొన్ని ప్రాంతాల్లో వీరి ఓట్లు గెలుపోటములను సైతం ప్రభావితం చేస్తుంటాయి. ఈ క్రమంలో ఎన్నికల సమయంలోనూ కొందరు రాజకీయ పార్టీల నేతలు ఓట్ల కోసం వీరిని రప్పించేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇందుకోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయడం, కూలీ ఇవ్వడం వంటివి చేస్తారు. అయితే ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నా.. వీరిపై పెద్దగా రాజకీయ పార్టీలు దృష్టిపెట్టడం లేదన్న వాదన వినిపిస్తోంది.

రవాణా ఖర్చులతో..

గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల సందర్భంగా గ్రామంలోని ప్రతి ఓటరుపై ప్రత్యేకంగా ఫోకస్ ఉంటుంది. ప్రతి ఓటును అమూల్యమైనదిగా భావించి వలస ఓటర్లను గ్రామానికి రప్పించేందుకు ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధమవుతాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ వలస ఓటర్లను గుర్తించి, వారిని ఓటింగ్‌కు రప్పించేందుకు పార్టీలు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశాయి. అయితే లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నా ఈసారి వలస ఓటర్లను రప్పించేందుకు సన్నాహాలు పూర్తికాలేదని తెలుస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఉన్న కుటుంబాలను ఇక్కడికి రప్పించేందుకు వారికి రానుపోను ప్రయాణ చార్జీలతో పాటు కూలీ సైతం చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఒక్కో కుటుంబానికి రూ.10 నుంచి 15 వేల వరకు ఖర్చు అవుతోందని అంచనా వేస్తున్నారు. గతంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వలస కూలీలకు ప్రత్యేకంగా వాహనాలను సమకూర్చి ఇంటికి రప్పించి ఓటు వేసేలా పార్టీ నేతలు పురమాయించారు. గ్రామాల్లోని క్షేత్రస్థాయి నేతల ద్వారా సదరు కుటుంబాలు ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారన్న అంచనాతో ఆయా పార్టీల నేతలు వలస కూలీల తరలింపునకు ఏర్పాట్లు చేశారు. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయకుండా ప్రయాణ చార్జీల వరకే చెల్లించి నెట్టుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే తమకు ఆశించినంత మేరకు ఓటింగ్ జరగక నష్టపోయామని ఓ పార్టీ భావిస్తోంది. వలస కూలీల తరలింపునకు అయ్యే ఖర్చులకు వెనకాడే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలు వారిపై ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అయితే ఈసారి ఎన్నికల్లో వీరి ప్రభావం ఏ పార్టీకి అనుకూలంగా.. ఏ పార్టీకి ప్రతికూలంగా మారనుందన్నది చర్చనీయాంశంగా మారింది.

ఒక్కో నియోజకవర్గంలో 20 వేలపైనే..

ప్రధానంగా నారాయణపేట, కొడంగల్, వనపర్తి, దేవరకద్ర, మక్తల్, మహబూబ్‌నగర్, అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది ఇతర ప్రాంతాలకు ఇక్కడి నుంచి వెళ్లి ఉపాధి పొందుతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 20 వేల వరకు వలస ఓటర్లు ఉన్నారు. నారాయణపేట నియోజకవర్గంలోని నారాయణపేటతో పాటు ధన్వాడ, దామరగిద్ద, కోయిలకొండ ప్రాంతాల్లో వలస కార్మికుల సంఖ్య గణనీయంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని గండేడ్, మహమ్మదాబాద్, హన్వాడ మండలాలకు చెందిన తండాలవాసులు భారీగానే ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు, కోస్గి, బొంరాస్‌పేట మండలాల ప్రజలు అత్యధికంగా ఇతర రాష్ట్రాల్లో ముంబై, బెంగళూరు, పుణె వంటి చోట్ల స్థిరపడి ఉన్నారు. వీరందరి ఓట్లు, ఆధార్, రేషన్‌కార్డులు సొంత గ్రామాల్లోనే ఉన్నాయి. ఎన్నికలు ఏవైనా వలస ఓటర్లు తమదైన శైలిలో గెలుపోటముల్లో ప్రభావం చూపుతున్నారు. పంచాయతీ, స్థానిక సంస్థలు, శాసనసభ ఎన్నికల్లో వీరిపైనే ప్రధానంగా ఫోకస్ పెట్టిన ప్రధాన పార్టీలు ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేస్ జైవన్షీ, కలెక్టర్ ఉదయ్‌కుమార్

- నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించాలి
- ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేస్ జైవన్షీ, రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలని.. అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రుచేస్ జైవన్షీ, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పోలింగ్ రోజున మాక్ పోల్ అనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించేలా చర్యలు చేపట్టడంతో పాటు ఎప్పటికప్పుడు జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని.. రహస్య పోలింగ్ కంపార్ట్‌మెంట్ సరిగ్గా ఏర్పాటు చేశారా లేదా అన్నది పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా సాంకేతిక లోపంతో మొరాయించే ఈవీఎంల స్థానంలో కొత్త ఈవీఎంల ఏర్పాటు.. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ ఇతర అధికారుల విధులను గమనించాలని తెలిపారు. టెండర్, చాలెంజ్ ఓటింగ్‌లు జరిగితే, వాటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా, పోలింగ్ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించడం వరకే మైక్రో అబ్జర్వర్ల బాధ్యత అని.. ఎక్కడ కూడా పోలింగ్ విధుల్లో జోక్యం చేసుకోకూడదని తెలిపారు. 18 అంశాలకు సంబంధించిన నివేదికను ఎప్పటికప్పుడు జనరల్ అబ్జర్వర్‌కు నేరుగా పంపాలన్నారు. ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

385 మంది మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ..

జిల్లాలో రిజర్వు సిబ్బందితో కలిపి మొత్తం 385 మంది మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. పోలింగ్ ప్రక్రియను గమనించడమే మైక్రో అబ్జర్వర్ల పాత్ర అని అన్నారు. ఎక్కడ ఏ చిన్న ఘటన చోటు చేసుకున్నా నిశితంగా పరిశీలించాలని.. ఏదేని ఘటన జరిగితే మైక్రో అబ్జర్వర్ల నివేదికలే కీలకమని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు. పోలింగ్ నిర్వహణలో ప్రతి అంశాన్ని మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ప్రభావితం చేయకుండా నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల సంఘం గుర్తింపు కార్డు కలిగిన వారు, ఎన్నికల విధులు నిర్వహించే వారు మినహా.. ఇతరులకు పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన కేంద్రాల్లో విద్యుత్, మంచినీరు, ఫర్నిచర్, వీల్‌చైర్, ర్యాంప్ వంటి మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 17–ఏ రిజిస్టర్ నిర్వహణ, పోలింగ్ ప్రక్రియపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల ట్రెనింగ్ జిల్లా అధికారి గోపాల్ పాల్గొన్నారు.

ఈదురుగాలుల దుమారం



నర్సాయిపల్లిలో ఈదురుగాలులకు నేలకొరిగిన మామిడి చెట్లు

కొల్లాపూర్/కోడేరు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొల్లాపూర్‌లో 35.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈదురుగాలుల ధాటికి వరిచేన్లు నెలకొరిగాయి. మామిడికాయలు రాలిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కోడేరు మండలం నర్సాయిపల్లికి చెందిన రైతులు నారాయణ, పర్వతాలు, శాంతమ్మ, శిరీష మామిడి తోటల్లో చెట్లు విరిగిపడ్డాయి.

కాంగ్రెస్‌తోనే వికలాంగుల సంక్షేమం..

- రాష్ట్ర వికలాంగ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య



మాట్లాడుతున్న వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలోని వికలాంగుల సంక్షేమం, అభివృద్ధికి బాటలు పడుతాయని రాష్ట్ర వికలాంగ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో వికలాంగులతో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, గీత కార్మికులకు మొదట పెన్షన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని చెప్పారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో వికలాంగుల సంక్షేమం కోసం ఆరు అంశాలను పొందుపర్చిందని తెలియజేశారు. వికలాంగులపై వివక్ష తొలగించేందుకు ప్రత్యేక చట్టాలను రూపొందిస్తామని, చత్తీస్‌ఘడ్ తరహాలో స్థానిక సంస్థల్లో వికలాంగులకు రిజర్వేషన్లు అమలుచేస్తామని అన్నారు. ప్రత్యేక శాఖగా ఉన్న వికలాంగుల శాఖను స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో విలీనం చేసిన చరిత్ర మాజీ సీఎం కేసీఆర్‌దని చెప్పారు. వికలాంగుల నేషనల్ ట్రస్టుకు చైర్మన్, కమిషనర్‌ను నియమించకుండా బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని ఆయన కోరారు.

కొలతల ప్రకారం 'ఉపాధి' పనులు చేపట్టాలి

తెలకపల్లి: ఉపాధిహామీ పథకం కూలీలకు రోజు రూ.300 కూలి వచ్చేందుకుగాను కొలతల ప్రకారం పనులు చేపట్టాలని డీఆర్డీఓ చిన్నఓబులేష్ అన్నారు. మండలంలోని అనంతసాగర్‌లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఒండ్రుమట్టి తరలింపు పనులను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఓటు హక్కుపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఓ మల్లేష్, బీఎస్ నారాయణమ్మ, ఈసీ రామస్వామి పాల్గొన్నారు.



11న వనపర్తికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా

వనపర్తి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 11న వనపర్తికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మంగళవారం వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో సభా ప్రాంగణం ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. సభ విజయవంతానికి పార్టీ శ్రేణులను భారీగా సమీకరించనున్నట్లు వెల్లడించారు. వారి వెంట నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రభారి ఎద్ల అశోక్‌రెడ్డి, మాజీ శాసనమండలి సభ్యుడు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ రాగి రామకృష్ణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, రామన్‌గౌడ్, పెద్దిరాజు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆందోళన

- ఆస్పత్రి ఎదుట బందోబస్తు చేపట్టిన పోలీసులు
- ఆదుకుంటామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే
- పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాల అప్పగింత



పాలమూరు చౌరస్తాలో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

కల్వకుర్తి టౌన్: ఎమ్మెల్యే కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో దుర్మరణం పాలైన మృతుల కుటుంబాలను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులతో పాటుగా వారి బంధువులు పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఆస్పత్రి వద్ద జనం భారీగా గుమ్మిగూడటంతో పోలీసులు భద్రత పెంచారు. నరేష్(28) సోమవారం రాత్రి మృతిచెందటంతో అప్పటికే కల్వకుర్తిలోని సీహెచ్‌సీ మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న పరశురాములు(35) సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతిచెందగా.. అతడి మృతదేహాన్ని అక్కడే ఉంచారు. ఇద్దరి మృతదేహాలను ఒక దగ్గరికి తీసుకొస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందని పరశురాములు మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలోనే పోస్టుమార్టం నిర్వహించారు. నరేష్ మృతదేహాన్ని సాధారణంగా మార్చురీలో ఉంచారని, ఫ్రీజర్ లేకపోవటంతో దుర్వాసన వచ్చిందని బంధువులు, కుటుంబ సభ్యులు కొద్దిసేపు ఆందోళన చెప్పారు. వెంటనే కల్వకుర్తి సీఐ నాగార్జున కలుగజేసుకొని వెంటనే ఫ్రీజర్‌ను తెప్పించి, మృతదేహాన్ని ఫ్రీజర్‌లో పెట్టించారు. రెండు కుటుంబాలకు చెందిన మృతుల బంధువులు అందరూ ఒక్కసారిగా మధ్యాహ్నం రోడ్డుపైకి వచ్చి ధర్నా చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకొని సంబంధిత కాంగ్రెస్ నాయకులను పిలిపించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో వారు ధర్నా విరమించారు.

ఆదుకుంటాం..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మృతుల కుటుంబాలకు అండగా ఉండటమే గాక వారిని ఆదుకుంటామని ఎమ్మెల్యే నారాయణరెడ్డి హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు మృతుల కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఎమ్మెల్యే తన వ్యక్తిగతంగా నరేష్ కుటుంబానికి రూ.20 లక్షలు, పరశురాములు కుటుంబానికి రూ.30 లక్షలు సాయంగా అందిస్తామని తెలియజేయటంతో పాటుగా, వెంటనే వారి కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా వాటిని కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ ద్వారా వాటిని అందించారు. మృతుల కుటుంబ సభ్యులకు తక్షణ సాయంతో పాటుగా, వారికి భవిష్యత్‌లో అండగా ఉంటానని ఎమ్మెల్యే తెలియజేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా.మల్లురవి వారి కుటుంబాలకు అండగా ఉంటామని హామీఇచ్చారు. ఆయన వెంట కల్వకుర్తి అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఇందిరాశోభన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రమాద కారకులపై చర్యలు తీసుకోవాలి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి టౌన్: రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చిన రోడ్డు ప్రమాద కారకులపై చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డా.ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నరేష్(28) కుటుంబాన్ని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్ రెడ్డి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ కనీసం వేగాన్ని పాటించాలని తెలియకుండా ఇలాంటి ప్రమాదాలకు కారణమైతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. వాహనాన్ని నడిపిన డ్రైవర్‌తో పాటుగా అందులో ప్రయాణించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతిచెందిన కుటుంబ సభ్యులకు రూ.కోటి తక్షణ సాయంగా అందించటంతో పాటుగా, వారి కుటుంబాలకు ఎప్పటికీ అండగా ఉంటామని హామీ ఇవ్వాలన్నారు. ఆయన వెంట కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, కడ్తాల జెడ్పీటీసీ దశరథ్ నాయక్ తదితరులు ఉన్నారు.

నల్లమలలో గుప్తనిధుల వేట

లింగాల: నల్లమల అటవీ ప్రాంతంలో గుప్తనిధుల వేట సాగుతోంది. పురాతన దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని తవ్వకాలు చేపడుతున్నారు. తాజాగా అప్పాయపల్లి పరిధిలోని బెళ్లంతిప్ప పరిసర ప్రాంతంలో గుప్తనిధుల కోసం జేసీబీతో తవ్వకాలు జరిపారని స్థానికులు తెలిపారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు వివిధ కారణాలు చూపుతూ, నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలిసింది. ఆధునిక యంత్రాలను ఉపయోగిస్తూ గుప్తనిధుల వేట సాగిస్తున్నట్లు తెలుస్తుంది. దీనిపై ఎఫ్ఆర్‌ఓ వీరేశంను వివరణ కోరగా.. గుప్తనిధుల కోసం తవ్వకాల విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం • ఎంపీ అభ్యర్థి మల్లురవి

గెలిచే సీట్లలో నాగర్‌కర్నూల్ ఒకటి.. • కేంద్ర మంత్రి లోగనాథన్ మురుగన్

మీ బిడ్డను ఎంపీగా ఆదరించండి • బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- వివరాలు IIలో..

పప్పు ప్రధాని అయితే దేశాన్ని అమ్మేస్తాడు

- కేసీఆర్ చిన్న మోసగాడు.. రేవంత్‌రెడ్డి పెద్ద మోసగాడు
- కోస్గి రోడ్ షోలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



కోస్గిలో రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్, చిత్రంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ అభ్యర్థి డీకే అరుణ

కోస్గి: రాష్ట్ర ప్రజలు నమ్మి అధికారం ఇస్తే అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్ చిన్న మోసగాడైతే.. అమలు సాధ్యం కాని ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి పెద్ద మోసగాడని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. గత కాంగ్రెస్ పాలనలో రూ.12 లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డారని.. ఇప్పుడు గన్‌షాట్‌లో పప్పు (రాహుల్‌గాంధీ) ప్రధాని అయితే దేశాన్ని అమ్మేస్తారన్నారు. దేశంలో పెద్ద జోకర్ రాహుల్‌గాంధీ.. రాష్ట్రంలో చిన్న జోకర్ రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా నారాయణపేట జిల్లా కోస్గిలో మంగళవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో రాజాసింగ్ పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే రూ.లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలు అమలు చేయాలంటే డబ్బులు సోనియాగాంధీని అడిగి ఇటలీ నుంచి తీసుకువస్తాడా అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రైతు రుణమాఫీ చేయలేదని, రూ.500 గ్యాస్ సిలిండర్ ఇవ్వలేదని, రైతు భరోసా ఇవ్వడం చేతగాని రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలు ఎలా అమలు చేస్తాడో ప్రజలు ఆలోచించాలన్నారు. మోసగాళ్లకు మారుపేరు రేవంత్‌రెడ్డి అని, అమిత్ షా వీడియోలను ఎడిట్ చేసి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తారని తప్పుడు ప్రచారం చేయించారని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేయడం ఖాయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి మద్దతుగా నిలిచి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి దేశ సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

స్థాయికి తగ్గట్టుగా మాట్లాడాలి..

రాష్ట్రస్థాయిలో కనీసం మంత్రి పదవి చేపట్టలేని రేవంత్‌రెడ్డి కొడంగల్ ప్రజల ఆశీస్సులతో ముఖ్యమంత్రి అయినప్పటికీ జెడ్పీటీసీ స్థాయిలోనే మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా స్థాయికి తగ్గట్లు మాట్లాడాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. అధికారంలోకి రాగానే ఢిల్లీకి వెళ్లి మోదీ ముందు మోకరిల్లి వేడుకోవడంతో రూ.9 వేల కోట్లు తెచ్చుకొని ఉద్యోగులకు వేతనాలు అందించారన్నారు. మోదీని పెద్దన్నగా అభివర్ణించి.. అప్పుడే మాట మార్చాడని, మోదీ ముందు కూర్చునే స్థాయి లేనప్పటికీ ఇష్టారీతిగా విమర్శించడం రేవంత్‌రెడ్డికే చెల్లిందన్నారు. కామారెడ్డిలో నాపై గెలవలేక కేసీఆర్, రేవంత్‌రెడ్డి పారిపోయి వస్తే కొడంగల్ ప్రజలు ఆశీర్వదించారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి మోదీకి అండగా నిలవాలన్నారు. ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఓ ఆడపడుచును పట్టుకొని మాట్లాడుతున్న తీరును ప్రజలు గమనించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం



చిన్నంబావి మండలం పెద్దదగడలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నబావి/ కొల్లాపూర్: మహిళల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రాత్రి కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలతో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. మంత్రితో పాటు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి భార్య రాజబన్సీదేవీ సమావేశానికి హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జూపల్లి కృష్ణారావు వివరించారు. మహాలక్ష్మి పథకంలోని అన్ని అంశాలను అమలు చేస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు ఏడాదికి రూ.లక్ష సాయం అందిస్తామన్నారు. బీఆర్ఎస్, బీజేపీల నాయకుల మాటలు నమ్మొద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో తన భర్త మల్లురవిని గెలిపించాలని రాజబన్సీదేవి కోరారు.

ప్రతి కార్యకర్త కృషి చేయాలి

మల్లురవిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని జూపల్లి పిలుపునిచ్చారు. చిన్నంబావి మండలంలోని పెద్దదగడలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా మెజార్టీ ఏ మాత్రం తగ్గకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఈ మూడు నెలల్లో చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గతంలో కేసీఆర్‌ను నియంత అని తిట్టి, ప్రస్తుతం ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయనకు.. ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. దేశంలో నరేంద్ర మోదీ హవా లేనే లేదన్నారు. ఎంపీగా మల్లురవిని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పగిడాల శ్రీనివాస్, శ్రీలతారెడ్డి, జెడ్పీటీసీ జూపల్లి భాగ్యమ్మ, మహిముదాబేగం, రమ్యకుమారి, రామచంద్రరెడ్డి, కల్యాణ్ రావు, కృష్ణప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గెలిచే సీట్లలో నాగర్‌కర్నూల్ ఒకటి..



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి మురుగన్

బిజినేపల్లి: దేశవ్యాప్తంగా బీజేపీ గెలిచే 400 సీట్లలో నాగర్‌కర్నూల్ కూడా ఒకటని కేంద్ర సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి లోగనాథన్ మురుగన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ చేయిస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికీ ఆర్నెల్లు కావస్తున్నా ఎంత అవినీతి జరిగిందో బయట పెట్టలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి కుటుంబమని.. అందుకే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లిందని తెలిపారు. సోమశిల వద్ద రూ.2,400 కోట్లతో ఐకాన్ వంతెన నిర్మిస్తున్నామని, కొల్లాపూర్‌లో మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌కు బీజేపీ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు రఘు, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు నిరంజన్ పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి, బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల నాయకులు భూషయ్య, తిరుపతి రెడ్డి, నారాయణచారి పాల్గొన్నారు.

మీ బిడ్డను ఎంపీగా ఆదరించండి

బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

తెలకపల్లి: అలంపూర్‌లో పుట్టి నల్లమలలో పెరిగిన మీ బిడ్డను నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా గెలిపించి ఆదరించాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డితో కలిసి మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. ఉన్నత విద్యావంతుడిగా, ఇక్కడే పుట్టిపెరిగిన వ్యక్తిగా తనకు ఈ ప్రాంతంలోని అన్ని సమస్యలపై అవగాహన ఉందని చెప్పారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతానికి విద్యారంగంలో, పారిశ్రామికంగా ప్రపంచ పటంలో నిలుపుతామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్దపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని, ఐదు నెలల్లో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పోలీసుల పహారా లేకుండా బయటకు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఏళ్లుగా వెనుకబడిన నాగర్‌కర్నూల్ ప్రాంతంలోని పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని, పేద విద్యార్థుల పాలిట మేనమామను అవుతానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాగం శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ మోదీకే సాధ్యం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

నారాయణపేట: ఎస్సీ వర్గీకరణకోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంజనగార్డెన్ హాల్‌లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధనకు జరిగిన మాదిగ ఉపకులాల ప్రజా ఆశీర్వాద సభ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాదిగలను కాంగ్రెస్ ఆనాటి నుంచి నేటి వరకు మోసం చేస్తూనే వస్తుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సీఎం రేవంత్ తన ఎదుగుదలకు ఎస్సీలే మూలకారణమని బహిరంగంగా ప్రకటించిన రాష్ట్రంలోని మూడు పార్లమెంట్ స్థానాల్లో ఒక్క మాదిగకు టికెట్ కేటాయించలేదన్నారు. బీజేపీ రెండు పార్లమెంట్ స్థానాల్లో ఒక అసెంబ్లీ స్థానంలో మాదిగలకు టికెట్లు ఇచ్చి ప్రధాని మోదీ విశ్వాసాన్ని చాటుకున్నారన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మాదిగ సభలో ఎస్సీ వర్గీకరణ చేస్తానని బహిరంగంగా ప్రకటించిన ఏకైక ప్రధాని మోదీ అన్నారు. అంతేకాకుండా వర్గీకరణకు కమిటీని నియమించి సుప్రీంకోర్టులో ఉన్న కేసుపై విచారణ జరిపిస్తున్నామని తప్పకుండా త్వరలో ఎస్సీ వర్గీకరణ చేయడం ఖాయమన్నారు. మాదిగ బిడ్డల భవిష్యత్ కోసం నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రి చేసేందుకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కోలార్ ఎంపీ మునిస్వామి, నాగురావు నామాజీ, శ్రీనివాసులు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ (కథలప్ప) ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ, జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించారు.. ఓటుతో సత్తా చాటుతాం



మాట్లాడుతున్న బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ సాగర్

దేవరకద్ర: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలను విస్మరించి అగ్రవర్ణాల వారికే అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇచ్చాయని ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో సైతం అగ్రవర్ణాలకే టికెట్లు కేటాయించి బీసీలకు అన్యాయం చేశారని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎం. శ్రీనివాస్ సాగర్ ఆరోపించారు. మంగళవారం దేవరకద్రలో ఆయన విలేకలరులతో మాట్లాడుతూ బీజేపీలో ఎంతో కాలంగా పని చేస్తున్న బీసీ నాయకులను కాదని రెడ్డి సామాజిక వర్గానికే అసెంబ్లీ టికెట్ ఇచ్చారని ఇప్పుడు కూడా అదే విధానం పాటించి డీకే అరుణకు టికెట్ కేటాయించారని మండిపడ్డారు. ఎంతో కాలంగా బీజేపీలో పని చేస్తున్న బీసీ నేతలకు అవకాశం ఇవ్వకుండా అన్యాయం చేశారని, దీనికి ప్రతిగా బీజేపీకి వ్యతిరేకంగా పని చేస్తూ బీసీలను చైతన్య పరుస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో బీసీల నుంచి పూర్తి వ్యతిరేకతను బీజేపీ మూటగట్టుకున్నదని తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గంలోని బీసీలను మోసం చేసిన వారికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలోరమేశ్, కురుమయ్య, నాగేశ్‌గౌడ్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ సవారి సత్యం, జంగం విశ్వనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



తనను గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్న మల్లురవి

తాడూరు: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మేడిపూర్, పాల్కూరు, గుట్టలపల్లి గ్రామాల్లో మాట్లాడారు. ఇంటింటా తిరిగి దేశాభివృద్ధికి కాంగ్రెస్ అందించిన సేవలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. పదేళ్ల ప్రధాని మోదీ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎమర్జెన్సీని మించిన నియంతృత్వ పోకడలు పోతూ.. రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకిక విలువ మీద దాడి చేస్తుందన్నారు. రాముడి పేరుతో, మతం పేరుతో ప్రజల దృష్టిని మరల్చి ఈసారి అధికారంలోకి వస్తే.. రాజ్యాంగాన్ని మార్చి మతరాజ్యాన్ని స్థాపించాలని ప్రయత్నిస్తుందన్నారు. పిలుస్తే పలికే మల్లురవిగా ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సేవ చేశానన్నారు. తనకు మరోసారి అధికారం ఇస్తే పేద ప్రజలకు అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కొలను వల్లబ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయ కులు ఎండీ అజీద్, రామచంద్రారెడ్డి, ముత్యాలాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునే బీజేపీని ఓడించండి

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి అవినీతితో రాజ్యమేలాలనుకుంటున్న బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌రెడ్డిని బలపరచాలని ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏనుగొండ, బీకేరెడ్డి కాలనీ, బండమీదిపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వంశీచంద్‌రెడ్డి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో అన్ని వర్గాలకు మోసం చేసినట్లు ఆరోపించారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. తాను పేదింటి మధ్య తరగతి బిడ్డనని, మీరు ఎదుర్కొన్న సమస్యలే నేను అనుభవించానని, స్వార్థ ప్రయోజనాలకు గిట్టవని అన్నారు. మీ బిడ్డగా ఆశీర్వదించి, అండగా నిలబడి ఓట్లు వేసి భారీ మెజార్టీతో నన్ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మన పార్లమెంట్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి మూడు నెలల్లో రూ.10వేల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని, రానున్న రోజుల్లో ఇంకా వేల కోట్లతో అభివృద్ధి పథకాలు ఎదురుచూస్తున్నాయన్నారు. ఇలాంటి మన భవిష్యత్ తరాలకు అందాలంటే ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్, కొత్వాల్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, నాయకులు వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, ఎన్‌పీ.వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, ఏపీ.మిథున్‌రెడ్డి, రాధా అమర్ పాల్గొన్నారు.

బోనులో చిక్కిన చిరుత



వైద్య పరీక్షల అనంతరం చిరుతను అమ్రాబాద్ అడవులకు తరలిస్తున్న అధికారులు

వైద్య పరీక్షల అనంతరం నల్లమలలో వదిలేసిన అధికారులు



నందిగామ శివారులో బోనులో చిక్కిన చిరుత

మద్దూరు: అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసినా బోనులో చిరుత చిక్కిన సంఘటన కొత్తపల్లి మండలంలోని నందిగామ కాటరాలగుట్టలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తులు ఈ విషయమై అటవీ శాఖ, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో నారాయణపేట డీఎఫ్‌ఓ శ్రీనివాస్‌గౌడ్, రేంజ్ అధికారి వంశీకృష్ణ, సెక్షన్ అధికారి లక్ష్మణ్‌నాయక్, ఎస్‌ఐ రాంలాల్‌లు సిబ్బందితో రాగా.. మండల పశువైద్యాధికారి రాఘవేందర్‌గౌడ్ చిరుతకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం చిరుతను నల్లమల అడవుల్లో వదిలేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఉమ్మడి మద్దూరు మండలంలో మరో రెండు చిరుతలు సంచరిస్తున్న ఆనవాళ్లు ఉన్నాయని, వాటి కోసం కొత్తపల్లి మండలంలోని పెద్దతండా గుట్టల్లో ఒక బోను, మద్దూరు మండలంలోని మోమినాపూర్ గుట్టల్లో మరో బోను ఏర్పాటు చేస్తున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

'సాక్షి'కి కృతజ్ఞతలు

మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని మోమినాపూర్, నందిగామ గుట్టల్లో చిరుత పులులు సంచరిస్తూ.. పశు సంపదపై దాడి చేస్తున్న వైనంపై ఈ నెల 3న 'సాక్షి'లో 'వెంటాడుతున్న చిరుత భయం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అటవీ శాఖ అధికారులు ఈ నెల 4న నందిగామ పరిసర ప్రాంతంలో బోను ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా పడిగాపులు కాయగా.. మంగళవారం తెల్లవారుజామున బోనులో చిక్కిందని సెక్షన్ అధికారి లక్ష్మణ్‌నాయక్ తెలిపారు.

'దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ'



దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్యను సన్మానిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దివ్యాంగుల సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ఆయన జిల్లా కేంద్రానికి చేరుకొని, స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులు, వితంతవులు, వృద్ధులకు మొదట పింఛన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వ హాస్టల్‌లో, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో దివ్యాంగుల సంక్షేమం కోసం పలు అంశాలు పొందుపరిచినట్లు చెప్పారు. దివ్యాంగులపై వివక్షను ఆర్టికల్ 15, 16ను సవరించి రాజ్యాంగ సవరణ ద్వారా అదనపు అంశాలు చేర్చి చర్యలు తీసుకుంటుందన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఇచ్చిన మాదిరిగా, దేశ వ్యాప్తంగా దివ్యాంగులకు రిజర్వేషన్లు, దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను సంపూర్ణంగా అమలు తదితర అంశాలను మేనిఫెస్టోలో చేర్చినట్లు చెప్పారు. బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తివేయడానికి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అనంతరం చైర్మన్‌ను సత్కరించారు. సమావేశంలో తెలుగు వెంకటేశ్, బురానప్ప, నర్సింలుగౌడ్, పాందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కొల్లాపూర్: పట్టణంలోని ఖాదర్‌పాషా దర్గా సమీపంలో ఉన్న బావిలో పడి జంగిడి సొడాల రాముడు (60) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నాగిశెట్టి రైస్‌మిల్ సమీపంలో నివాసం ఉంటున్న రాముడు మధ్యాహ్నం వేళ ఈత కొట్టేందుకు బావికి వెళ్లాడని.. పైనుంచి దూకగా నీటిలోని రాళ్లు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు.

ఇంటర్ ఫెయిల్ అయ్యామని..

మనస్తాపంతో ఇద్దరు విద్యార్థుల బలవన్మరణం




చికిత్స పొందుతూ మృతి చెందిన వైష్ణవి, నితీష్ (ఫైల్)

అమరచింత/బిజినేపల్లి: ఇంటర్ ఫెయిల్ కావడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. వనపర్తి జిల్లా అమరచింత మండలం సింగంపేటకు చెందిన నితీష్ (17) వరంగల్‌లోని మైనార్టీ గురుకులంలో ఇంటర్ సెకండియర్ పూర్తి చేసి, పరీక్షల అనంతరం స్వగ్రామానికి వచ్చాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఒక సబ్జెక్ట్ ఫెయిల్ కావడంతో ఎంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన నితీష్ ఆత్మకూర్ శివారులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఇప్పలపల్లికి చెందిన వైష్ణవి (18) నాగనూల్ కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇంటర్ చదవగా.. ఫెయిల్ అయింది. దీంతో పదిరోజులుగా మనస్తాపంతో ఉన్న వైష్ణవి మంగళవారం ఉదయం ఇంట్లో ఫినాయిల్ తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు చుట్టు పక్కల వారి సహాయంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తీసుకురాగా.. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లి మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపడి 48 గొర్రెలు మృతి



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అల్వాలకి చెందిన గొల్ల బుడ్డన్న, గొల్ల టంకరి రమేష్‌కు సంబంధించిన 48 గొర్రెలు పిడుగుపడి మృతిచెందాయి. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులు వచ్చాయి. మధ్యరాత్రి ఒక్కసారిగా గొర్రెల మందపై పిడుగుపడింది. దీంతో మందలోని 48 గొర్రెలు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఏఐసీసీ స్టేట్ కో–ఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి, గట్టు తిమ్మప్ప, రాజేంద్రప్రసాద్ యాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. అనంతరం ప్రభుత్వం నుంచి ఆదుకునేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. పెంటన్నయాదవ్, సత్యారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, లాయర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.




చేగుంట చెక్‌పోస్టులో సీజ్ చేసిన నగదుతో పోలీసులు, ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో..

వాహన తనిఖీలు ముమ్మరం

కృష్ణా: పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం చేగుంట వద్ద ఉన్న సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ ఎండీ నవీద్, ఎక్సైజ్, కేంద్ర సాయుధ బలగాలు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లాకు చెందిన మహ్మద్ హుస్సేన్ కారులో రూ.16,47,100 నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ వివరించారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి నారాయణపేట గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు వివరించారు.

సోళీపురంలో.. రూ.1,13,700..

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం సోళీపురం సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.1,13,700 నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. వనపర్తికి చెందిన స్వామి బైక్‌పై వెల్టూర్ నుంచి వనపర్తికి నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నామని.. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని చెప్పారు.

బాలానగర్‌లో..

బాలానగర్: బాలానగర్‌లోని పోలీస్ చెక్‌పోస్టులో తనిఖీలు చేపడుతుండగా కడప జిల్లా లక్కిరెడ్డిపల్లికి చెందిన పసుపులేటి సుధాకర్ వద్ద రూ.55 వేలు పట్టుబడినట్లు ఎస్‌ఐ తిరుప్పాజీ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

- Prakruthi Entrepreneurs Pvt Ltd Village Mart Managers & Mandal Dealers, Salary 56000/- Best opportunity Contact: 9963560410
- ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్సను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని / వంటపనిచేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663

గమనిక


ఇందు గుర్జార్

ప్రపంచంలో చాలామంది ఒకే తరహా పనిని ఏళ్లుగా చేస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తుంటారు. కొందరు మాత్రం ఏకకాలంలో ఎన్నో పనులు చేస్తూ సమాజంలో తమకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకోవాలని ఎప్పుడూ ప్రయత్నిస్తుంటారు. అలాంటి వారిలో ఒకరు ఇందు గుర్జార్. జైపూర్‌వాసి అయిన 32 ఏళ్ల ఇందు గుర్జార్ సింగిల్ పేరెంట్‌గా తన తొమ్మిదేళ్ల కూతురును చూసుకుంటూ, బ్యాంకు ఉద్యోగం చేస్తూ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా, మౌంటెనీర్ బైకర్‌గా గుర్తింపు తెచ్చుకుంటోంది. సవాళ్లను అధిగమిస్తూ ఇందు చేస్తున్న ప్రయత్నం ఒడిదొడుకులను ఎదుర్కొనేవారికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

ఉండాల్సింది ధైర్యం మాత్రమే!

‘‘సమస్యలు వచ్చేదే మనలోని శక్తిని గుర్తించడానికి. ధైర్యం తెచ్చుకొని ప్రయత్నిస్తే తిరిగి మనకో కొత్త జీవితం ఏర్పడుతుంది. నా చిన్నతనంలో మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. మా నాన్నకు టీ కొట్టు ఉండేది. కానీ, దాని నుంచే ఆయన తన కొడుకులలో ఒకరిని డాక్టర్‌ని చేసి, మా అందరికీ ఉత్తమవిద్యను అందించడానికి ప్రయత్నించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. చిన్ననాటి నుంచి క్రీడలంటే చాలా ఆసక్తి. రాష్ట్రస్థాయిలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ ఆడాను. కాలేజీలో స్పోర్ట్స్ ఆప్షన్ లేకపోవడంతో నా ఇష్టాన్ని అక్కడితో వదిలేయాల్సి వచ్చింది.

■ గృహహింస

మా కమ్యూనిటీలో అమ్మాయిలకు పెళ్ళిళ్లు త్వరగా చేస్తారు. కానీ, నా తల్లిదండ్రుల సహకారంతో గ్రాడ్యుయేషన్ వరకు చదువుకున్నాను. ఆ వెంటనే పెళ్లి చేశారు. పెళ్లి నా జీవితాన్ని విచ్ఛిన్నం చేసింది. బిడ్డను కనాలని, వరకట్నం తేవాలని... ప్రతిరోజూ ఏదో ఒక విషయం మీద నరకం చూసేదాన్ని. అత్తింటివాళ్లు నా తల్లిదండ్రులకు నా మీద ఏవేవో చాడీలు చెప్పేవారు. పాప పుట్టిన తర్వాత పుట్టింటి నుండి తిరిగి అత్తవారింటికి వెళ్లడానికి భయపడ్డాను. కానీ, పెద్దవారిని కూర్చోబెట్టి, ఒప్పించి తిరిగి తీసుకెళ్లారు. కానీ, అక్కడి పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు లేదు. నెల రోజుల వ్యవధిలోనే మా అత్తింటిని వదిలి, తిరిగి పుట్టింటికి వచ్చేశాను. ఏడాది కాలం పుట్టింట్లోనే ఉన్నాను. పరిస్థితుల్లో మార్పు రాదని గ్రహించి, విడాకులకు కోర్టులో కేసు వేశాను. ఒంటరిగా బిడ్డను పెంచడం నాకు అంత తేలికైన పనికాదు. ఇంటి నిర్వహణకు, నా ఇష్టాలను నెరవేర్చుకోవడానికి ఇంధనం అవసరం. ఆ మనోవర్తి రూపంలో ఆ ఇంధనం రాబట్టుకోవడం కోసం ఏడేళ్లపాటు విడాకుల కేసుపై పోరాడుతూనే ఉన్నాను. కానీ, న్యాయం జరగలేదు.



■ డిప్రెషన్ నుంచి కోలుకొని...

ఆటుపోట్లతో ఉన్న జీవితాన్ని చూసి చాలా బాధపడేదాన్ని. ఒక వ్యక్తి జీవితంలో చెడుకాలం వచ్చినప్పుడు పరిస్థితుల ముందు లొంగిపోతాడు. కానీ, నాకు నేనుగా ఏదైనా లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలనుకున్నాను. బ్యాంకు ఉద్యోగం సంపాదించుకొని, నాకు నేనుగా జీవించడం మొదలుపెట్టాను.



■ ఫిట్‌గా ఉండేందుకు..

ఉద్యోగం చేయడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే కోవిడ్ వచ్చింది. మొదటి వేవ్‌లో కరోనా బాధితురాలిని అయ్యాను. వాడిన మందుల వల్లనేమో కోవిడ్ తర్వాత బరువు పెరగడం మొదలైంది. దీంతో ఫిట్‌గా ఉండేందుకు రోజూ రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసేదాన్ని. ఆ తర్వాత స్టేడియంకు వెళ్లడం మొదలుపెట్టాను. అక్కడ సైక్లిస్టుల బృందాన్ని కలిశాను. ఆ క్రీడలో పాల్గొనడానికి వయోపరిమితి ఏమీ లేదని తెలిసింది. దాంతో నాలో చిన్న ఆశ కలిగింది. బహుశా విధి నాకు అలాంటి అవకాశం ఇచ్చింది అనుకున్నాను. మొదట్లో రెండు–మూడు కిలోమీటర్లు సైక్లింగ్ చేసే నేను ఈ రోజు 50– 100 కిలోమీటర్లు తిరుగుతున్నాను. యూసీఐ (ఇంటర్నేషనల్ సైకిలిస్ట్ యూనియన్) ఎలిమినేటర్ ప్రపంచకప్‌లో పాల్గొన్నాను. ఎన్నో పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొని, అంతర్జాతీయ సైక్లిస్టులను కలిశాను.

■ పర్వత బైకర్‌గా...

వృత్తిరీత్యా బ్యాంకర్‌గానే కాకుండా మూడేళ్లుగా మౌంటెన్ బైకర్‌గా కూడా ఉన్నాను. పర్వతాల్లో చేసే సాహసోపేతమైన పోటీల్లో విజేతగా నిలుస్తుండేదాన్ని. ఆ పోటీలు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చేవి. రెండేళ్ల క్రితం లదాఖ్‌లోని లేహ్‌లో జరిగిన యుసిఐ ఎలిమినేటర్ ప్రపంచ కప్‌లో ఎలైట్ మహిళల విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపించింది.

■ శక్తిని గుర్తించాలి..

నా కూతురికి ఇప్పుడు తొమ్మిదేళ్లు. ఆమె కూడా క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నాను. అందుకు ట్రెనింగ్ కూడా ఇప్పిస్తున్నాను. చదువుతోపాటు టాలెంట్‌ను కూడా గుర్తించి, దానిని మెరుగుపరచుకునే ప్రయత్నం చేయాలని అమ్మాయిలకు చెబుతుంటాను. ఈ నెల పదిన జరిగే రేస్‌లో పాల్గొంటున్నాను. గెలుపు – ఓటమి, విజయం – అపజయం అని చింతించకుండా 100 శాతం శక్తినీ, సామర్థ్యాన్నీ వినియోగించి లక్ష్యాన్ని సాధించి, ఫలితాన్ని భగవంతునికే వదిలేయాలి. ఇంకో విషయం.. ఏదైనా కొత్తగా చేయడానికి వయసుతో సంబంధం లేదు. ఏ వయసులోనైనా విజయం సాధించవచ్చు. మీకుండాల్సింది ధైర్యం మాత్రమే’’ అంటుంది ఇందు.

స్ఫూర్తి

పరీక్షల సీజన్ వస్తే రమా పద్మనాభన్ ఇంటి వ్యవహారాలను పెద్దగా పట్టించుకోదు. పెళ్లిళ్లు, ప్రయాణాలు అసలే ఉండవు. ఆమె తనకు వచ్చే కాల్స్‌ను అటెండ్ చేసే పనిలో ఉంటుంది.
‘అక్కా.. ఈ ఎగ్జామ్ రాయాలి’
‘ఆంటీ... ఈ డేట్‌న ఎంట్రన్స్ ఉంది’
ఇలా దివ్యాంగులు ఆమెకు కాల్స్ చేస్తుంటారు.
వారి కోసం ఆమె పరీక్ష హాల్‌కు వెళ్లి వారి ఆన్సర్స్‌ను రాసి పెడుతుంటుంది.
‘ఇది గొప్ప తృప్తినిచ్చే సేవ’ అంటోందామె.


ఓ దివ్యాంగుడికి పరీక్ష రాసిపెడుతున్న రమా పద్మనాభన్

పరీక్షా కాలంలో పలికే చేయి

చదువుకునే రోజుల్లో ఎవరైనా పరీక్షలు రాయవచ్చు. చదువు అయిపోయాక ఏవైనా కోర్సులు సరదాగా చదివితే పరీక్షలు రాయవచ్చు. కాని రమా పద్మనాభన్ అలా కాదు. ఆమె ప్రతి ఆరు నెలలకు విద్యార్థులకు సెమిస్టర్ ఎగ్జామ్స్ జరిగినప్పుడల్లా 50 పరీక్షలు రాస్తుంది. అంటే రాసి పెడుతుంది. గత పదకొండేళ్లుగా ఆమె అలా చేస్తూనే ఉంది. దివ్యాంగులకు పరీక్షలు రాసి పెట్టే స్క్రయిబ్‌గా ఆమెకు కోయంబత్తూరులో ఉండే పేరు అలాంటిది.

గృహిణిగా ఉంటూ...

కోయంబత్తూరుకు చెందిన రమా పద్మనాభన్ సైకాలజీలో డిగ్రీ చేసింది. ఆ తర్వాత ‘గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్’లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కూడా చదివింది. భర్త ఫైనాన్షియల్ సెక్టార్‌లో పని చేస్తాడు. ఆమెకు ఇద్దరు అబ్బాయిలు. గృహిణిగా పిల్లలను చూసుకుంటూ కాలం గడుపుతున్న రమా పద్మనాభన్ జీవితం 2013లో మారింది. ‘ఆ రోజు నేను యోగా క్లాసుకు బయలుదేరాను. నా స్నేహితురాలి నుంచి ‘ఒక అంధ విద్యార్థికి పరీక్ష రాసి పెడతావా?’ అనే విన్నపం వచ్చింది. అలా రాయగలనా అనుకున్నాను. పరీక్ష కేంద్రం దగ్గరే కనుక ట్రై చేద్దామనిపించింది. వెళ్లి రాసి పెట్టాను. పరీక్ష ముగిశాక ఆ అంధ విద్యార్థి ముఖంలో కనిపించిన కృతజ్ఞత నాకు ఎంతో మనశ్శాంతిని ఇచ్చింది. ఆ తర్వాత నాకు కాల్స్ రావడం మొదలైంది. కోయంబత్తూరులో లూయిస్ బ్రెయిలీ అకాడెమీ ఉంది. వాళ్లు కాల్ చేస్తూనే ఉంటారు. వీరు కాకుండా దివ్యాంగులు, ఆటిజమ్ విద్యార్థులు... వీరు పెన్ పట్టి పరీక్ష రాయడం కష్టం. వారికి పరీక్షలు రాసి పెడుతుంటాను’ అని తెలిపింది రమా పద్మనాభన్.



అంతా ఉచితమే

దివ్యాంగులకు, అంధులకు పరీక్షలు రాసేందుకు రమ ఎటువంటి రుసుమూ తీసుకోదు. పరీక్షా కేంద్రానికి కూడా సొంత ఖర్చులతోనే వెళ్లి వస్తుంది. ‘అయితే అందుకు నా భర్తను అభినందించాలి. నీ డబ్బులు ఖర్చు పెట్టి వేరొకరి పరీక్షలు ఎందుకు రాస్తున్నావు అని ఎప్పుడూ అడగలేదు’ అంటుంది రమ. ‘అంధ విద్యార్థులు తమకు పరీక్షలు రాసి పెట్టే వారు లేరని తెలిస్తే చాలా టెన్షన్ పడతారు. ఆబ్సెంట్ అయితే పరీక్ష పోతుంది. అందుకే వారికి స్క్రయిబ్‌లు కావాలి. వారు చెబుతుంటే జవాబులు సరిగ్గా రాయగలగాలి. నేను ఆటిజమ్ విద్యార్థులకు రాసి పెట్టేటప్పుడు మరింత శ్రద్ధగా ఉంటాను. వారు సమాధానాలు కంటిన్యూస్‌గా చెప్పడంలో ఇబ్బంది పడతారు. ప్రోత్సహిస్తూ రాబట్టాలి. అదే కాదు హైస్కూల్ పాఠాల దగ్గరి నుంచి ఇంజినీరింగ్ పాఠాల వరకూ అవగాహన ఉండాలి. అందుకే ఆ పాఠాలు కూడా తెలుసుకుంటూ ఉంటాను. స్క్రయిబ్‌గా నేను మారేటప్పటికి నా పిల్లలు చిన్నవాళ్లు. నా చిన్నకొడుకుకైతే ఐదారేళ్లవాడు. ఇంటిదగ్గర వాణ్ణి ఒక్కణ్ణే వదిలి తాళం వేసుకుని పరీక్ష రాసి పెట్టిన సందర్భాలున్నాయి’ అని తెలిపిందామె.

కొనసాగే అనుబంధం

‘నేను రాసిన పరీక్షలతో కోర్సులు పాసై ఉద్యోగాలు పొందిన దివ్యాంగులు చాలా మంది ఉన్నారు. వాళ్లంతా నా కాంటాక్ట్‌లో ఉంటారు. తమ జీవితంలో సాధిస్తున్న ప్రగతిని తెలియజేస్తుంటారు. అదంతా వింటుంటే ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. జీవితానికి ఒక అర్థం దొరికినట్టు ఉంటుంది. నా పెద్దకొడుకు సీనియర్ ఇంటర్‌కు వచ్చాడు. వాణ్ణి వీలున్నప్పుడల్లా స్క్రయిబ్‌గా పని చేయడానికి పంపుతున్నా. వాడు ఆ పని చేస్తున్నందుకు ఎంత సంతోషపడుతున్నాడో చెప్పలేను’ అని ముగించింది రమా పద్మనాభన్.

యూత్ పల్స్

విద్యాప్రమాణాలు మెరుగుపడడం, కొత్త రంగాలు ఉనికిలోకి రావడం వల్ల ‘ఉద్యోగమే సర్వస్వం’ ‘ఉద్యోగం దొరికితే చాలు’ అనుకోవడం లేదు యువతరంలో చాలామంది. దీనికి కారణం...ప్రత్యామ్నాయ అవకాశాలు. ‘ఉద్యోగం ఎందుకు చేయాలి?’ నుంచి ‘చేస్తే ఎలాంటి ఉద్యోగం చేయాలి’ వరకు కెరీర్ బాట పట్టడానికి ముందు రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నారు. మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

నవతరం... ఉద్యోగ పర్వం



44 దేశాల్లో మిలీనియల్స్, జెన్ జెడ్‌పై సర్వే చేసింది డెలాయిట్. దీని ప్రకారం ప్రైమరీ జాబ్‌తోపాటు మరో జాబ్ చేస్తున్న యువ ఉద్యోగుల సంఖ్య తక్కువేమీ కాదు. బెంగళూరులో ఒక ప్రైవేట్ కాలేజీలో పని చేస్తున్న పరిమళ ఆన్‌లైన్‌లో వ్యాపారం కూడా చేస్తుంటుంది.

‘డబ్బు కోసం కాదు. అదొక ప్యాషన్’ అంటుంది తన ఆన్‌లైన్ వ్యాపారం గురించి.

లింక్డ్ ఇన్ సర్వే ప్రకారం 2023లో మన దేశంలో 88 శాతం మంది జెన్ జెడ్ ఉద్యోగులు ‘ఉద్యోగ మార్పు’నకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జెన్ జెడ్ ఉద్యోగులపై ఆర్పీజీ గ్రూప్ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పదిమందిలో ఆరుగురు మంచి వేతనం కంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

‘పని ఒత్తిడి చచ్చినట్లు భరించాల్సిందే’ అని రాజీపడడం కంటే ‘జీతం తక్కువ అయినా సరే నాకు నచ్చిన ఉద్యోగం చేస్తాను’ అని ఆలోచిస్తున్న వారి సంఖ్య యువతరంలో ఎక్కువగానే ఉంది.

ముంబైలోని ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం చేసిన అనన్యకు పనిభారంతో ఊపిరాడేది కాదు. ఒక ఫైన్ మార్నింగ్ ‘ఇది కాదు జీవితం’ అనిపించింది. తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తోంది. ‘నేను పని చేస్తున్న కంపెనీతో పోల్చితే ఇది చాలా చిన్న ఉద్యోగం కావచ్చు. కాని ఎంతో సంతోషంగా ఉంది’ అంటుంది అనన్య.

ఒక మార్కెటింగ్ సంస్థలో ఉద్యోగం చేసిన ఇరవై సంవత్సరాల సారా బోప్రా ఆ ఉద్యోగం మానేసి సొంతంగా మార్కెటింగ్ ఫర్మ్ మొదలుపెట్టింది. వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది.

‘ఇప్పుడు చాలా సౌకర్యంగా ఫీలవుతున్నాను. పని ప్రకారం కాదు గంటల ఆధారంగా ప్రొడక్టివిటీని కంపెనీలు అంచనా వేస్తున్నాయి’ అంటుంది సారా.

తీయటి పాఠాలు

రాజస్థాన్‌లోని వనస్థలి యూనివర్శిటీలో బీబీఏ డిగ్రీ పూర్తి చేసిన అనువ కక్కర్ ఉద్యోగం కంటే సొంత స్టార్టప్‌కే ప్రాధాన్యత ఇచ్చింది. అయితే కస్టమైజ్డ్ పోస్టర్ కార్డ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ బిజినెస్‌లో ఫెయిల్ అయింది. అయితే ఈ ఫెయిల్యూర్ నుంచి పాఠాలు నేర్చుకున్న అనువ ‘టిగెల్’ చాకొలెట్ బ్రాండ్‌తో సక్సెస్ అయింది. హాట్ చాక్లెట్+వింటర్= హ్యాపీనెస్ నినాదంతో చిన్న బడ్జెట్‌లో కంపెనీ మొదలు పెట్టింది. కస్టమర్ చాయిస్‌లను అర్థం చేసుకోవడంలో పట్టు సాధించింది. ‘టిగెల్’ స్టార్ట్ చేసినప్పుడు అనువ వయసు 21 సంవత్సరాలు. ‘చిన్న వయసులో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానం మొదలు పెట్టడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది’ అంటుంది అనువ కక్కర్.



బెస్ట్ ప్లాన్ బెడిసి కొడితే?

‘ఈ రంగంలో మాత్రమే పనిచేస్తాను అని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఏ రంగంలో పని చేయడానికైనా సిద్ధంగా ఉన్నాను. యాంత్రిక జీవితం కంటే ఉల్లాసకరమైన మార్పు చాలామంచిది’ అంటుంది చెన్నైకి చెందిన శ్రీతేజ.

కోల్‌కత్తాకు చెందిన 23 సంవత్సరాల మనీష తన ఉద్యోగానికి సంబంధించి ఇప్పటికీ మూడు రంగాలు మారింది. అలా అని ఆమెలో పశ్చాత్తాపం ఏమీ లేదు.

‘ఏ రంగంలో అయినా పనిచేయగలను అనే నమ్మకం వచ్చింది’ అంటుంది మనీష.

వర్క్ నుంచి గ్యాప్ తీసుకోవాలనుకునే యువతరం కోసం ఈమధ్య కాలంలో ఎన్నో ‘గ్యాప్ ఇయర్ కమ్యూనిటీస్’ వచ్చాయి. ‘గ్యాప్ ఎక్స్’ పేరుతో హరియాణాలోని అశోకా యూనివర్శిటీలో 40 మంది స్టూడెంట్స్‌తో కూడిన గ్రూప్ ఉంది.

‘యువతలో చాలామంది కెరీర్ మార్గాన్ని నిర్ణయించుకునే ముందు వివిధ అవకాశాల గురించి అన్వేషిస్తున్నారు. ఆలోచిస్తున్నారు’ అంటున్నాడు దిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ దినేష్ సింగ్.

చేస్తున్న ఉద్యోగాన్ని మానేసి నచ్చిన ఉద్యోగం చేయడం, సొంతంగా కంపెనీ మొదలుపెట్టడం, ఉద్యోగ విరామం తీసుకొని ఆన్‌లైన్ కోర్సులలో చేరడం వరకు తమదైన దారిలో ప్రయాణం చేస్తోంది నవతరం.

రంగుల ప్రపంచానికి ఆవల...

● సోషల్ యాక్టివిస్ట్ ● ఫ్యాషన్ డిజైనర్ ● రైటర్ ● మోటివేషనల్ స్పీకర్

అదర్ సైడ్


కరీనా కపూర్

కరీనా కపూర్ అనగానే రంగుల ప్రపంచం కళ్ల ముందు ఆవిష్కారం అవుతుంది.
అయితే ఈ అందాల నటికి మరో ప్రపంచం కూడా తెలుసు.
స్త్రీ సాధికారత నుంచి మెన్‌స్ట్రువల్ హైజీన్ వరకు ఎన్నో అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు వెళుతోంది. పేదింటి బిడ్డలతో మాట్లాడుతోంది.
తాజాగా యూనిసెఫ్ ఇండియా నేషనల్ అంబాసిడర్‌గా నియామకం అయిన కరీనా కపూర్‌లో ఫ్యాషన్ డిజైనర్, రైటర్, మోటివేషనల్ స్పీకర్, సోషల్ యాక్టివిస్ట్ ఉన్నారు...

ఉత్తమనటిగా సుపరిచితమైన కరీనా కపూర్ సృజనాత్మకమైన డిజైనర్ కూడా. క్లాతింగ్ రిటైలర్ ‘గ్లోబస్’తో కలిసి పనిచేసింది. న్యూట్రిషనిస్ట్ రుజుత దివాకర్‌తో కలిసి తీసుకు వచ్చిన ‘డోంట్ లూజ్ యువర్ మైండ్, లూజ్ యువర్ వెయిట్’ పుస్తకం అమ్మకాల్లో రికార్డ్ సృష్టించింది. కరీనా కపూర్ వాయిస్‌తో ఈ పుస్తకం ఆడియో బుక్‌గా రావడం మరో విశేషం. ‘ది స్టైల్ డైరీ ఆఫ్ బాలీవుడ్ దివా’ పేరుతో తన జ్ఞాపకాల పుస్తకాన్ని తీసుకువచ్చింది. అదితి షా బీమ్జానీతో కలసి ప్రెగ్నెన్సీపై రాసిన పుస్తకం కమర్షియల్‌గా సక్సెస్ అయింది. రుజుత దివాకర్‌తో కలిసి న్యూట్రిషన్‌కు సంబంధించి ‘ది ఇండియన్ ఫుడ్ విజ్‌డమ్ అండ్ ది ఆర్ట్ ఆఫ్ ఈటింగ్ రైట్’ డాక్యుమెంటరీపై పనిచేసింది.

ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై వచ్చిన ‘గర్ల్ రైజింగ్’ అనే డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్‌కు వాయిస్–వోవర్ ఇచ్చింది.

ఒకవైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ... పిల్లల విద్య, మహిళల భద్రతకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. మహిళలపై హింసను నిరోధించడానికి ఎన్‌డీ టీవి ప్రారంభించిన శక్తి క్యాంపెయిన్‌కు అంబాసిడర్‌గా పనిచేసింది. 2014 నుంచి బాలికల విద్యకు సంబంధించి యూనిసెఫ్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టింది. రాజస్థాన్, మహారాష్ట్రలోని పాఠశాలలకు వెళ్లి అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకునేది. జాల్నా జిల్లాలో కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంది.

నిరుపేద పిల్లల చదువు కోసం షర్మిలా టాగూర్‌తో కలిసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. చైల్డ్–ఫ్రెండ్లీ స్కూల్ అండ్ సిస్టమ్స్ (సీఎఫ్ఎస్ఎస్) ప్యాకేజీని లాంచ్ చేసింది. చత్తీస్‌ఘడ్‌లో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ వీక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బాగా చదివే పిల్లలు, పాఠాలు బాగా చెప్పే టీచర్‌లకు పురస్కారాలు అందజేసింది.

మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై యూనిసెఫ్ లక్నోలో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించింది. ‘నవజాత శిశువులను కాపాడుకుందాం’ పేరుతో కరీనా రాసిన వ్యాసానికి మంచి స్పందన వచ్చింది. నవజాత శిశువులు, తల్లుల క్వాలిటీ హెల్త్ కేర్‌కు సంబంధించి ‘ఎవ్రీ చైల్డ్ అలైవ్’ అనే క్యాంపెయిన్‌ను నిర్వహించింది. మదర్స్ డే సందర్భంగా యూనిసెఫ్ దిల్లీలో నిర్వహించిన సమావేశంలో కరీనా ప్రధాన వక్త.

ప్రకృతి వైపరీత్య బాధితుల కోసం, ఎన్నో స్వచ్ఛంద సేవా సంస్థల కోసం నిధుల సేకరణ కార్యక్రమాల్లో పాల్గొంది కరీన. పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుదలకు సంబంధించిన అంశాలపై పనిచేసే స్వస్థ్ ఇమ్యునైజేషన్ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసింది.

తాజా విషయానికి వస్తే...‘నేషనల్ అంబాసిడర్‌గా యూనిసెఫ్‌తో నా అనుబంధం కొనసాగడం గౌరవంగా భావిస్తున్నాను. పిల్లల చదువు, హక్కుల కోసం నా గొంతు వినిపిస్తాను’ అంటుంది కరీనా కపూర్.

‘కరీనా కపూర్ ఎక్సలెంట్ కమ్యూనికేటర్’ అని కితాబు ఇచ్చింది యూనిసెఫ్.

> “ చిన్న విజయం చాలు... పెద్ద సంతోషానికి
>
> 
>
> సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ‘నేను ఎలా సాధించానంటే’లాంటి స్టోరీలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రేస్ మొదలైంది. ఆ రేస్‌లో భాగంగా యువతరం ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఈ రేసులో మెంటల్ హెల్త్ అనేది వెనక్కి వెళ్లిపోయింది. రేస్ అనేది శాంతి, సంతోషాల కోసం ఉండాలి. విద్యార్థులు తమ మానసిక శాంతిపై ఎక్కువ దృష్టి పెట్టాలి. చిన్న విజయాన్ని కూడా పెద్ద విజయంగా భావించుకోవాలి. ‘ఇదీ ఒక విజయమేనా!’ అనుకున్నప్పుడు అసంతృప్తి ఉంటుంది. అసంతృప్తి నుంచి అశాంతి జనిస్తుంది.
>
> – కరీనా కపూర్